క్లుప్తంగా

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి


గణపవరంలో సెమిస్టర్-2 పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో బాలయ్య

గణపవరం: నిర్ణీత సమయానికి సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను ఎఫ్ఏ-2 పరీక్షలకు సిద్ధం చేయాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. శనివారం గణపవరంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా సెమిస్టర్-1 సిలబస్ పూర్తి చేయాలన్నారు. వెంటనే సెమిస్టర్-2 పాఠ్యాంశబోధన చేపట్టాలని, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1, పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం వీరవేణి, సీఆర్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ పరికరాల వితరణ

కొయ్యలగూడెం: స్థానిక వృద్ధాశ్రమంలో వ్యాయామ పరికరాలను డాక్టర్ నరహరిశెట్టి సతీష్ శనివారం ప్రారంభించారు. వృద్ధులు వ్యాయామం చేయడానికి అనువుగా ఉండే పరికరాలను ముళ్లపూడి సత్యనారాయణ సుజాత దంపతులు కృషితో దాతల నుంచి సేకరించిన రూ.లక్షతో కొనుగోలు చేశామని ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు, మాజేటి సత్యనారాయణ తెలిపారు. ఈ పరికరాలను ఉపయోగించే విధానంపై దంపతులు కొద్దిరోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. సెలవు దినాల్లో చిన్నారులు ఆటవిడుపు కోసం పరికరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. సురక్ష హాస్పిటల్ డాక్టర్ దిలీప్ కుమార్, లలిత ప్రియ హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్, సాయి ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టర్ పి.రాజశేఖర్, రోటరీ క్లబ్ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు.

8, 9 తేదీల్లో క్రీడా ఎంపికలు

ఏలూరు(ఆర్ఆర్‌పేట) : ఏలూరు మండల లెవెల్, అర్బన్, రూరల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ ఫెడేషన్ ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం శనివారపుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఎస్‌జీఎఫ్ మండల, అర్బన్ స్థాయి ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో అండర్-14 బాలురు, బాలికలు, అండర్-17 బాలురు బాలికలకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.ప్రకాష్, మండల కోఆర్డినేటర్ పి.పద్మలత, ఫిజికల్ ఎడ్యూకేషన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రమేష్, దుర్గాప్రసాద్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

పోరుబాట కరపత్రాల పంపిణీ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని ఫ్యాప్టో నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం భోజనం విరామ సమయంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న చలో విజయవాడ పోరుబాట కరపత్రాలు, పోస్టర్లను ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జి.మోహన్, ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, మండల ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేక సేవ


అంజన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామి ఉత్సవమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. ఆలయానికి వివిధసేవలు, విరాళాల ద్వారా రూ.3,21,918 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. స్వామి వారి నిత్యాన్నదానానికి అయినవిల్లికి చెందిన కె.వీరవెంకట విశ్వేశ్వరరావు (ఆంజనేయస్వామి గురువులు) రూ.96 వేలు విరాళంగా ఇచ్చారని చెప్పారు.

యువకుడికి విద్యుత్ షాక్

కామవరపుకోట: విద్యుత్ షాక్‌కు గురై యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఆడమిల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆడమిల్లికి చెందిన బోనల వంశీ స్థానిక విద్యుత్ లైన్‌మెన్ వద్ద ప్రైవేట్ సహాయకునిగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం గ్రామంలో మద్దుకూరి సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తూ ఉండగా ఒక్కసారిగా సరఫరా రావడంతో షాక్ గురై మంటల చెలరేగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వంశీని ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వంశీ ఆరోగ్యం విషమంగా ఉందని తెలిపారు. అయితే విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని, గతంలో ఇలాంటి ఘటనలు మండలంలో జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

పశు బీమా ఏదీ?

- ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే పైసా కూడా అందని వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో పాడి రైతులు



దెందులూరు: పాడి రైతులకు అండగా నిలిచే పశు బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. పాడినే నమ్ముకుని జీవించే వారతంతా కష్టాలు పడాల్సి వస్తోంది. వర్షాకాలం కావడంతో అనుకోని విపత్తులతో పశువులు మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో పశుబీమా కొంత ఊరటనిస్తోంది. అలాంటి బీమాపై ఈ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగితే పాడి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

వ్యాధుల కాలం

వర్షాకాలంలో గేదెలు, ఆవులు, జీవాలకు హెచ్ఎస్ బీక్యూ, గాలికుంటు, థైలేరియా, తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాణాంతక వ్యాధులు సోకడం వల్ల పశువులు మృత్యువాత పడుతుంటాయి. వీటికి తోడు వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ ఘాతాలు సంభవించినప్పుడు కూడా పశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. లక్ష రూపాయలు అప్పు చేసి కొనుగోలు చేసిన పశువులు మృతి చెందితే ఆ రైతు పడే బాధ వర్ణనాతీతం. పశుబీమా ద్వారా సాయం అందితే కొంత ఉపశమనం కలుగుతోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో పశు బీమా పథకం పక్కాగా అమలు జరిగింది. పాడి పశువు మృతి చెందితే రూ.15వేలనుంచి రూ.30 వేల వరకు పరిహారం అందించి ఆదుకుంది. ప్రభుత్వం తరపున పశువైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించేవారు. అందులో రైతు వాటా కింద 3.5శాతం బీమా ప్రీమియం ఉండేది. దీని వలన రైతుకు కొంతమేర ఉపయోగంగా ఉండేది. క్షీర సార పథకం ద్వారా 6, 7నెలల చూడితో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బీమా సౌకర్యం లేకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పశుబీమాపై ఇంతవరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం.

బీమా సౌకర్యం కల్పించాలి



పశువులకు బీమా సౌకర్యం కల్పించాలి. గతంలో ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. ప్రమాదవశాత్తు జీవాలు మృత్యువాత పడితే పూర్తిగా నష్టపోతాం. రెండు పాడి ఆవులు కొనాలంటే ఇప్పుడు రూ.లక్షన్నర ఖర్చు అవుతోంది. పశుపోషణ కూడా భారంగా మారింది. ఇలాంటి సమయంలో బీమా సౌకర్యం లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. పశుపోషణ వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– మాగంటి రాజు, రైతు, దెందులూరు

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



ప్రస్తుతం ఆవులు, గేదెలు ఇతరత్రా పెంపుడు జీవాలకు సంబంధించిన బీమా ప్రీమియం కట్టించుకునేందుకు ప్రభు త్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇంతవరకు అందలేదు. బీమా సౌకర్యంపై చాలా మంది రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బీమా సౌకర్యం కల్పిస్తాం.

– డా. హరికృష్ణ, మండల పశువైద్యాధికారి

పాడి రైతులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలి. శాశ్వత ప్రణాళిక ప్రయోజనం కల్పించాలి. బీమా కల్పన విషయంలో రాజకీయాలు సరికాదు. తక్షణమే కూటమి ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించాలి.

– తొత్తడి వేదకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి

ఆర్థిక సాయం అందజేత

దెందులూరు: మండలంలోని మసీదుపాడు గ్రామానికి చెందిన కే.సువర్ణరాజు తీవ్ర అనారోగ్యం బాధపడుతుండతో 2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు మేమున్నామంటూ రూ.56 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రమాదవశాత్తు ఇటీవల సువర్ణరాజు మృతి చెందాడు. మరోసారి మిత్రులందరూ సువర్ణ రాజు కుటుంబ సభ్యులకు నగదు, నెలవారి సరుకులు శనివారం రాంబాబు వారి నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

8న మండల స్థాయి క్రీడా పోటీలు

దెందులూరు: దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈనెల 8వ తేదీ బుధవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఏవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం దెందులూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో అండర్ 14 బాలురు, బాలికలు అండర్ 17 బాలురు బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలపారు. ఈ సందర్భంగా మండల పీడీలు, పీఈటీలతో కొవ్వలి హైస్కూల్లో మండల కోఆర్డినేటర్ జి. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఏర్పాట్లకు సమాయత్తమవుతున్నట్లు ఎంఈఓ వివరించారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపులు

భీమడోలు: మండల వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని శనివారం అమ్మవార్ల గ్రామోత్సవాలు వైభవంగా జరిగాయి. భీమడోలు జంక్షన్, భీమడోలు ఈతకోటవారి వీధిలో కనకదుర్గాదేవి అమ్మవార్ల ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. భీమడోలు జంక్షన్‌లోని కొలువైన అమ్మవారిని సుందరంగా అలంకరించి అశ్వ వాహనంపై ఉంచి ఊరేగించారు. భీమడోలు ఈతకోట వారి వీధిలోని అమ్మవారిని పూలతో అలంకరించిన వాహనంపై అమ్మవారికి మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. శక్తి వేషాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మండలంలోని గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో అమ్మవార్లను ఊరేగించారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.


భీమడోలు ఈతకోట వారి వీధిలో పూలతో అలంకరించిన వాహనంపై అమ్మవారి ఊరేగింపు


భీమడోలు జంక్షన్‌లో అమ్మవారికి అశ్వవాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

గణపవరంలో అమ్మవార్ల ఊరేగింపు

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవార్లను అంగరంగ వైభవంగా ఊరేగిస్తున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై, బ్యాండుమేళాలు, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, విచిత్రవేషాలు, శక్తివేషాలతో గ్రామాలలో వీధి వీధినా ఊరేగిస్తున్నారు. చినరామచంద్రపురంలోని ధనలక్ష్మీ అమ్మవారి ఊరేగింపు ఎంతో ఆకర్షణీయంగా సాగింది. 9రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించగా ఆఅవతార మూర్తులు నవదుర్గలను ప్రత్యేకంగా ఒక్కో రిక్షాపై ఒక్కో రూపాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించారు. చినరామచంద్రపురం కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై ఉంచి ఊరేగించారు. తొలుత ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కంచికామాక్షి కనకదుర్గ ఆలయంలో అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కనకదుర్గ అమ్మవారిని బ్యాండుమేళాలు, విచిత్రవేషాలతో అట్టహాసంగా ఊరేగించారు.

అమ్మవారి గ్రామోత్సవాలు

పెదపాడు: దసరా నవరాత్రులు పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను పెదపాడులో విశేషంగా గ్రామోత్సవం నిర్వహించారు. పెదపాడులోని రామచంద్రపురంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు రెళ్ల రమణ ఏర్పాటు చేసిన భారీ అమ్మవారి విగ్రహానికి చివరిరోజున ప్రత్యేక పూజలు అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. నర్రా ఇండస్ట్రీస్ యానమాన్యం నర్రా బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అమ్మవారిని గ్రామోత్సవం కెఈ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు నరహరశెట్టి చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం రథంపై గ్రామోత్సం చేశారు.


పెదపాడులో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


హంసవాహనంపై కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు


ఆకట్టుకున్న శక్తివేషాలు

ప్రతి విద్యార్థికీ చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్

పెదవేగి : ప్రతి విద్యార్థికి చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సికాలనీలోని జవహార్ నవోదయ పాఠశాలను న్యాయసేవాధికార బృందం శనివారం సందర్శించారు. పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్ర, మంచినీటి సౌకర్యాలు, వైద్య సదుపాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, విద్యార్థులు చదువుతో పాటు ఇతర సాంస్కృతి కార్యక్రమాల పైన దృష్టి సారించి ఒత్తిడిని తొలగించుకోవడానికి తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి స్పందన, పాలకొల్లు అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పీవీఎస్ఎస్ లక్ష్మి లావణ్య, తణుకు రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)కె. కృష్ణవేణి, నిడదవోలు అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)షేక్ ఖవాజా రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి అనుమతులు తప్పనిసరి


దెందులూరు ఎస్ఐ ఆర్. శివాజీ

దెందులూరు: లైసెన్సు లేకుండా మందు గుండు తయారీ అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దెందులూరు ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. శనివారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ దీపావళి సామగ్రి అమ్మే గోడౌన్లు షాపులు జన సమూహానికి దూరంగా ఉంచాలన్నారు. ఫైర్ సేఫ్టీ చర్యలు విక్రయిదారులందరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనర్లను పనులకు వినియోగించకూడదని సూచించారు. ప్రతి షాపులో లైసెన్సును ముందుగా ప్రదర్శించాలన్నారు. అనుమతి పొందిన వారు మాత్రమే విక్రయాలు అధికారులు సూచించిన సమయంలో అమ్మాలన్నారు. దీపావళి రోజు సాయంత్రం ఐదు తర్వాత అమ్మకాలు నిషేధించడం జరిగిందని మండలంలో లైసెన్స్ పొందిన విక్రయదారులు విక్రయాలు షాపుల్లో నిబంధనల అమలుపై రెవెన్యూ, పోలీస్ శాఖ పర్యవేక్షణ విధిగా ఉంటుందని ఎస్ఐ అన్నారు. ఎవరైనా అక్రమంగా బాణ సంచా నిల్వలు చేస్తే వెంటనే సమాచారం పోలీస్టేషన్‌కు 9440796654, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబరు 8332959175కు తెలియజేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ అన్నారు.

అంతర్ జిల్లాల బదిలీల్లో ముగ్గురు టీచర్ల చేరిక


టీచర్‌కు ఉత్తర్వులు అందిస్తున్న ఎంఈవో నెం.1 ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: అంతర్ జిల్లాల బదిల్లో భీమడోలు మండలానికి ముగ్గురు టీచర్లను శనివారం చేరారు. వేరే జిల్లాల్లో పని చేస్తూ అంతర్ జిల్లాల బదిలీల్లో మండలంలోని భీమడోలు నెం.1, నెం.3, గుండుగొలను నెం.1 పాఠశాలలను ఆ ముగ్గురు మహిళా టీచర్లు కోరుకున్నారు. కౌన్సలింగ్‌లో కేటాయించిన పాఠశాలల్లో చేరాలని వారికి ఉత్తర్వులను అందించారు. శనివారం భీమడోలు ఎంఆర్సీలో భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు వారికి ఉత్తర్వులను అందించారు. విద్యార్థులకు చక్కని విద్యాబోధన చేయాలని, మండలానికి మంచి గుర్తింపు తేవాలని ఆయన వారికి సూచించారు. మండలంలోని పదవీ విరమణ వల్ల ఖాళీగా ఉన్న ఈ మూడు స్థానాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. ఇంకా మండలంలో మల్లరం, కొండ్రెడ్డినగర్, పూళ్ల నెం.2 పాఠశాలల్లో ఒకొక్క పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నాయని, వారిని డీఎస్సీలో ఎంపికైన టీచర్లతో భర్తీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

దూర ప్రాంతాలకు వెళ్లే భక్తులకు బస్సులేవీ?


భీమడోలు బస్టాండ్ ప్రాంగణంలో నిలబడిన భక్తులు


ప్రైవేటు వాహనాల కోసం రోడ్డుపై నిలబడిన భక్తులు

- రాత్రి వేళల్లోనూ బస్టాండ్ వద్దనే బస్సుల కోసం పడిగాపులు
- ప్రైవేటు వాహనాల్లో రెట్టింపు చార్జీలు
- భక్తుల అవస్థలు రెట్టింపు

భీమడోలు: భీమడోలు బస్టాండ్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే భక్తులకు బస్సుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో శనివారం రాత్రి కూడా సరైన బస్సుల్లేక వారంతా బస్టాండ్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. వారంతా చిన్న తిరుపతి వెంకన్నను దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యేవారే కావడం గమనార్హం. ఆర్టీసీ బస్సుల్లేక, ప్రైవేటు వాహనాలు రెట్టింపు ఛార్జీలు వసూలు చేయడంతో... చేసేది లేక తిరుగుప్రయాణం చేస్తున్నారు. అయితే భారీ వర్షం కురవడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునే భక్తులు అధిక సంఖ్యలో శనివారం, ఆదివారం వెళ్తుంటారు. ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో.. భక్తులు రద్దీ మరింత పెరిగింది. అయితే అందుకు తగ్గట్లుగా ఆర్టీసీ సరైన బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో భక్తులు కష్టాలు వర్ణనాతీతం. ద్వారకాతిరుమల స్వామి వారి దర్శనానికి వెళ్లే ప్రయాణం... భక్తులకు చుక్కలు చూపుతుంది. పలు జిల్లాల నుంచి వచ్చే భక్తులకు సరిపడా బస్సులు లేక ప్రయాణం నరకప్రాయంగా మారింది. సెలవుల్లో దైవ దర్శనానికి వెళ్లి, స్వగ్రామాలకు చేరాలంటేనే ఓ ప్రహసంగా మారింది. బస్టాండ్ ఇరుకుగా ఉండడంతో భక్తులంతా రోడ్డుపై ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ద్వారకాతిరుమలకు వెళ్లే అధిక సంఖ్యలోని భక్తులు భీమడోలు బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణ రోజుల్లో కన్నా సెలవులు, పండుగల రోజుల్లో రద్దీగా ఎక్కువగా ఉంటుంది. గతంలో కన్నా స్త్రీ శక్తి పథకం అమలుతోనే ఈ తిప్పలు ఎక్కువయ్యాయని వారంతా ప్రభుత్వ విధానాలను బాహాటంగా విమర్శిస్తున్నారు. భీమడోలు బస్టాండ్ భక్తులతో రద్దీగా మారింది. దీనితో వృద్ధులు, మహిళలు, పిల్లలతో వచ్చే వారి బాధలు వర్ణనాతీతంగా మారింది. స్త్రీ శక్తి పథకం అమలైన తర్వాత భీమవరం, నరసాపురంకు వెళ్లే బస్సులు రద్దు చేశారు. దీంతో ఆ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వచ్చే ఇతర డిపోల్లోని అరకొర బస్సుల్లో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. జాతీయ, రాష్ట్రీయ రహదారులకు కూడలిగా ఉన్న భీమడోలు బస్టాండ్‌కు గతంలో కన్నా బస్సు సర్వీసులు తగ్గడంతో నానా యాతనను అనుభవిస్తున్నారు. తమ గ్రామాలకు వెళ్లేందుకు అటూ బస్సుల్లేక.. వసతుల్లేని బస్టాండ్‌లో గంటల పాటు నిలబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ బస్టాండ్ నుంచి సుమారు 30 గ్రామాలకు చెందిన 5వేల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.ఈ బస్టాండ్‌కు ప్రతి రోజు 250 బస్సులకు వస్తుంటాయి. వాటిలో ఎక్కువగా జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు ఇదే ప్రధాన బస్టాండ్ కావడంతో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు.ఆ బస్సుల్లో ఎక్కేందుకు అవకాశం లేక బస్టాండ్‌లోని ప్రయాణికులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారింది. దీనితో ప్రైవేటు వాహనాలను ఎక్కితే చుక్కలు అంటుతున్న రేట్లతో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. స్త్రీ శక్తి ద్వారా లబ్ధి పొందిన సొమ్ము కన్నా రెట్టింపు ధరలతో నష్టపోతున్నామని వారంతా లబోదిబోమంటున్నారు. ఏదైనా రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని, సర్వీసులు పెంచి రద్దీని తగ్గించే చర్యలను ఆర్టీసీ అధికారులు, పాలకులు తీసుకోవాలని వారంతా వేడుకుంటున్నారు.

రేపు జాతీయ ఎస్టీ కమిషన్ మోదేలు సందర్శన

బుట్టాయగూడెం: అభయారణ్యంలో ఉన్న మోదేలు గ్రామానికి మంజూరైన రోడ్డు, విద్యుత్ సదుపాయం ఏర్పాటుకు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెప్పడంతో ఆ గ్రామ గిరిజనులు ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన మోదేలు గ్రామాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు సందర్శించనున్నారు. దీంతో గ్రామస్తులు సుమారు 5 కిలో మీటర్ల మేర రహదారిని శ్రమదానంతో బాగుచేశారు. శనివారం పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు మోదేలు గ్రామాన్ని సందర్శించారు. డీఎస్పీ, పోలీస్ సిబ్బంది లంకపాకల వరకు జీపుల్లో, వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా రోడ్డు లేకపోవడంతో లంకపాకల నుంచి ద్విచక్ర వాహనాలపై మోదేలు గ్రామం చేరుకున్నారు. డీఎస్పీ గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. ఆరోగ్యాలపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను సూచించారు.